సాక్షి ప్రకాశం

శుక్రవారం । 15 । మార్చి । 2024



సొంతింటి కల నెరవేర్చిన సీఎం జగన్

సొంతింటి కలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. - 10లో..



గీతాంజలిని పొట్టనబెట్టుకున్నారు

గీతాంజలిని టీడీపీ–జనసేన కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా ట్రోల్ చేసి ఆత్మహత్యకు పురిగొల్పారని వైఎస్సార్ సీపీ దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మండిపడ్డారు. - 10లో..

గరిష్టం/కనిష్టం 35/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

రంజాన్ వేళలు

శుక్రవారం - ఇఫ్తార్ : సా॥ 6.25

శనివారం - సహరీ : ఉ॥ 4.57





''బీసీ డిక్లరేషన్ సిద్ధం చేశాం.. బీసీలే మా వెన్నెముక అంటూ'' రాగం ఆలపించే టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు టికెట్లు పంపిణీ కొచ్చేసరికి వారిని పరిగణలోకి తీసుకోలేదు. ఎన్నికల సమయంలో బీసీ నినాదాన్ని తెరపైకి తెచ్చే ఆయన ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 అసెంబ్లీల్లో ఒక్కటంటే ఒక్క సీటు కేటాయించలేదు. అధికార వైఎస్సార్‌సీపీ కనిగిరి, కందుకూరు నియోజకవర్గాల్లో బీసీ తలకు టికెట్లు ఇచ్చి తన అభిమానాన్ని చాటుకుంది. పచ్చ పార్టీ తీరుపై బీసీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

బీసీ డైలాగ్ అంతామాయే

- సీట్ల కేటాయింపుల్లో పట్టించుకోని బాబు
- ఉమ్మడి జిల్లాలో ఒక్కటీ దక్కని వైనం
- ఇద్దరికి సీట్లిచ్చిన వైఎస్సార్‌సీపీ
- పచ్చ పార్టీ మోసం చేసిందంటూ బీసీల మండిపాటు
- కాపులదీ అదే పరిస్థితి
- రిజర్వు స్థానాల్లోనూ బాబు సామాజికవర్గానిదే పెత్తనం..
- దర్శిపై దొంగాట

సాక్షి ప్రతినిధి, ఒంగోలు : టీడీపీ రెండో జాబితా కూడా వచ్చేసింది. ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు రెండు దఫాలుగా అభ్యర్థుల జాబితాలను విడుదల చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాలకు గాను చీరాల, దర్శి మినహా మిగిలిన నియోజక వర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. అయితే ప్రకటించిన పది సీట్లలో ఒక్క బీసీకి కూడా సీటు ఇవ్వలేదు. సీటు ఇవ్వలేదు సరికదా కనీసం ఒక్క బీసీ నాయకుడి పేరు సైతం పరిగణలోకి తీసుకోకపోవడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. చంద్రబాబు మరోసారి బీసీలకు ద్రోహం చేశారని మండిపడుతున్నారు. జిల్లాలో ఒక అసెంబ్లీ స్థానంలో నుంచైనా పోటీ చేసే అవకాశం ఇస్తారని ఇన్నాళ్లు ఆశగా ఎదురుచూసిన బీసీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కనిగిరి, కందుకూరు అసెంబ్లీ సీట్లు ఇచ్చి ప్రోత్సహింటే ఇప్పటివరకు బీసీల పక్షపాతి అని ప్రచారం చేసుకుంటున్న టీడీపీ మాత్రం ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం దారుణమని బీసీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సామాజిక సమీకరణలను పరిగణలోకి తీసుకోకుండా అన్ని స్థానాల్లో కూడా ఆర్థికంగా దమ్మున్న నాయకులకే సీటు కట్టబెట్టారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఒంగోలు పార్లమెంట్ స్థానాన్ని బీసీలకు ఇస్తామంటూ మాట ఇచ్చిన చంద్రబాబు ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కారని, పార్టీలో ఉంటూ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న నూకసాని బాలాజీని వాడుకొని వదిలేశారని యాదవ సామాజిక వర్గానికి చెందిన నాయకులు మండిపడుతున్నారు. పార్టీలో పనిచేస్తున్న వారిని కాదని ఇంకా పార్టీలో చేరని అభ్యర్థికి ఒంగోలు ఎంపీ సీటు రిజర్వు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి ...

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా విభజన అనంతరం 8 స్థానాలు ఉన్నాయి. జిల్లాలో ఒంగోలు పార్లమెంట్ పరిధిలో 17,99,706 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో యర్రగొండపాలెం, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాలు ఎస్సీలకు రిజర్వ్ కాగా, మిగిలిన 5 నియోజకవర్గాల్లో ఒంగోలుకు దామచర్ల జనార్దన్, కనిగిరికి ఉగ్ర నరసింహారెడ్డి, మార్కాపురానికి కందుల నారాయణరెడ్డి, గిద్దలూరుకు ముత్తముల అశోక్‌రెడ్డిలకు సీట్లు ఇచ్చింది. దర్శి సీటు కూడా దాదాపుగా ఖరారు చేసినట్లు సమాచారం. ఇక్కడ కూడా బీసీలకు సీటు ఇచ్చే ఆలోచనలో లేదు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన గోరంట్ల రవికుమార్‌ను సమన్వయకర్తగా నియమించారు. ఈ ఐదు నియోజకవర్గాలలో బీసీ, కాపు నాయకులు ఒక్కరు కూడా ఎదగకుండా ఒక వ్యూహం ప్రకారం అణచివేశారన్న ఆరోపణలున్నాయి. ఒంగోలులో దామచర్ల ఒక్కడే నాయకుడు. మిగిలిన వారంతా జెండాలు మోసే కార్యకర్తలే. దామచర్ల చుట్టూ కూడా ఆయన సామాజిక వర్గానికి చెందిన కోటరే ఉంటుంది. ఇతరా కులాలకు చెందిన వారిని దగ్గరకు రానీయకుండా ఒక కోటరీని ఏర్పాటు చేసుకున్నారు. ఆయనకు ఏపని కావాలన్నా వారే దగ్గరుండి చూసుకుంటారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కూడా అంతే...

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని చీరాల టీడీపీ ఇన్‌చార్జిగా ఎంఎం కొండయ్య వ్యవహరిస్తున్నారు. ఆయనతో పాటుగా డాక్టర్ సజ్జా హేమలత కూడా చీరాల సీటును ఆశిస్తున్నారు. ఈ ఇద్దరూ బీసీ సామాజిక వర్గాలకు చెందినవారే. అయినప్పటికీ చీరాల సీటు బీసీలకు ఇవ్వకుండా ఎన్నారై అభ్యర్థిని రంగంలోకి దించాలని ప్రయత్నిస్తున్నారు. గతంలో ఒంగోలు నుంచి పోటీ చేయాలని ఎంఎం కొండయ్య యాదవ్ ప్రయత్నించారు. ఆయనను దామచర్ల అనేక ఇబ్బందులు పెట్టడంతో ఇక్కడ ఉండలేక పోయారు. బాపట్ల జిల్లాకు వెళ్లిపోయి అక్కడ నుంచి టీడీపీ సీటు కోసం ప్రయత్నిస్తున్నారు. చీరాల సీటు ఇస్తానని ఆయనకు హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు వంద కోట్లు ఖర్చు పెట్టాలని, అంతే పెద్ద మొత్తంలో పార్టీ ఫండ్ ఇవ్వాలని షరతులు పెట్టినట్లు తెలుస్తుంది. దీంతో కొండయ్య పోటీకి తటపటాయిస్తున్నట్టు సమాచారం. అద్దంకి, పర్చూరు సీట్లను సొంత సామాజిక వర్గానికి రాసిచ్చారని, ఇక్కడ పోటీ చేసే ఆలోచన రాకుండా సర్దుకుపోతున్నామని ఆ పార్టీకి చెందిన బీసీ నాయకులు చెబుతున్నారు. కొండపి, సంతనూతలపాడు, యర్రగొండపాలెం నియోజకవర్గాలు ఎస్సీలకు రిజర్వు అయ్యాయి. కొండపి, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో సైతం చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన నేతలే చక్రం తిప్పుతున్నారు. అక్కడ వారు చెప్పిందే వేదంగా నడుస్తోంది. కొండపిలో దామచర్ల సత్య, యర్రగొండపాలెంలో డాక్టర్ మన్నె రవీంద్రలదే పెత్తనం.

బీసీలను ఎదగనివ్వని టీడీపీ...

జిల్లా గతంలో అనేక మంది బీసీ నాయకులు టీడీపీలో పనిచేశారు. దామచర్ల జనార్దన్ రంగ ప్రవేశంతో పార్టీలో బీసీలు, ఇతరా బడుగు బలహీన వర్గాలపై అణచివేత మొదలైంది. వైఎస్సార్ సీపీ నుంచి వచ్చిన నూకసాని బాలాజీ ఒంగోలు అసెంబ్లీ స్థానం కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఆయన ఒంగోలు సీటుకు పోటీకి రాకుండా నామ్‌కే వాస్తేగా పార్లమెంట్ అధ్యక్షుడి పదవిలో నియమించి పార్టీని మాత్రం దామచర్ల చేతుల్లో పెట్టారు చంద్రబాబు. జిల్లాలో కాపులు పోటీ చేసేందుకు అవకాశం దర్శి నియోజకవర్గంలో ఉంది. గతంలో ఇక్కడ నుంచి నారపుశెట్టి పాపారావు ఎమ్మెల్యేగా చేసి ఉన్నారు. ఇప్పుడు కూడా ఆయన పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే కాపులకు సీటు ఇవ్వడం ఇష్టం లేని చంద్రబాబు తనదైన శైలిలో నాటకం మొదలుపెట్టారు. దర్శి సీటు జనసేనకు కేటాయించనున్నట్లు ప్రచారం చేశారు. ఆ సీటు కాపులకు పోకుండా తెరవెనక చక్రం తిప్పారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే కమ్మ సామాజిక వర్గానికి చెందిన గరికపాటి వెంకట్‌ను జనసేనలో చేర్పించి హడావుడి చేశారు. ఇప్పుడు జనసేన నుంచి దర్శిని టీడీపీ లాగేసుకోవడంతో నేరుగా టీడీపీ సీటు కోసం గరికపాటి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. గరికపాటితో పాటుగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన గోరంట్ల రవికుమార్, బాచిన కృష్ణ చైతన్య, డాక్టర్ లక్ష్మి పేర్లను మాత్రమే పరిశీలిస్తున్నారు. తమకు పోటీ చేసే అవకాశం ఉన్న దర్శి సీటును కూడా గద్దల్లా కొట్టుకొని పోయారని జిల్లాలోని కాపులు టీడీపీ అధినేత చంద్రబాబుపై గుర్రుగా ఉన్నారు. ఇక మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో కూడా తెలుగుదేశంలో బీసీల పరిస్థితి ఇలాగే ఉంది. ఈ నియోజకవర్గాలలో ఎక్కడా ఒక్క బీసీ నాయకుడిని దగ్గరకు తీసుకున్న దాఖలాలు లేవు. కాపులను వ్యూహం ప్రకారం అణగదొక్కుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. గిద్దలూరు నియోజకవర్గం నుంచి ఆమంచి స్వాములు పోటీ చేయాలని ప్రయత్నించినా టీడీపీ తెరవెనుక రాజకీయాలు, ఆ పార్టీకి జీ హుజూర్ అంటూ పవన్‌కళ్యాణ్ సాగిలపడడాన్ని జీర్ణించుకోలేక ఆయన రాజీనామా చేశారు. లేకపోతే కనీసం గిద్దలూరు నుంచైనా ఒక కాపు నాయకుడికి అవకాశం దక్కేదని చెబుతున్నారు.

న్యూస్‌రీల్

రెగ్యులర్ నియామకపత్రాలు అందజేత



నియామక పత్రాలు అందజేస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్

ఒంగోలు టౌన్: ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్ సూచించారు. వైద్య ఆరోగ్య శాఖలో గత 23 ఏళ్లగా కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగాలు చేస్తున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సర్వీసులను క్రమబద్ధీకరించిన విషయం తెలిసిందే. ఒంగోలు జీజీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లకు గురువారం నియామకపత్రాలు అందజేశారు. నిజాయితీతో నిబద్ధతగా ఉద్యోగం చేయాలని సూచించారు. తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పలువురు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మంజుల, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీ కుమారి ఉద్యోగులను అభినందించారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- పరీక్ష కేంద్రాలన్నీ నో సెల్‌ఫోన్ జోన్స్
- దీఈఓ సుభద్ర వెల్లడి



మాట్లాడుతున్న సుభద్ర, ప్రసన్నకుమార్

మార్కాపురం: ఈనెల 18 నుంచి నిర్వహించనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ సుభద్ర, రాష్ట్ర పరీక్షల పరిశీలకుడు ప్రసన్నకుమార్ ఆదేశించారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో గురువారం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారుల సమావేశంలో వారు మాట్లాడారు. పదో తరగతి పరీక్ష కేంద్రాలన్నింటినీ నో సెల్‌ఫోన్ జోన్లుగా ప్రకటించామని, ఇన్విజిలేటర్ల వద్ద ఫోన్ ఉండకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్షా హాలులోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దన్నారు. ఉదయం 8.45 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్ నుంచి ప్రశ్నాపత్రాలు తెచ్చేటప్పుడు, జవాబు పత్రాలను పోస్టాఫీసులో ఇచ్చేవరకూ పోలీస్ ఎస్కార్ట్‌తోనే ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేయించాలని, సమీపంలో ఉన్న జెరాక్స్ షాపులు మూసివేయించాలని ఆదేశించారు. కేంద్రాల్లో అత్యవసరమైతే హెల్త్ ఏఎన్ఎంలను కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయాలని తెలిపారు. విద్యార్థులు నేలపై కూర్చొని పరీక్షలు రాయకూడదని, తగినన్నీ బల్లలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని చీఫ్ డిపార్టుమెంట్ అధికారులకు సూచించారు. మార్కాపురం డివిజన్‌లోని 90 పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించినట్లు ఎంఈఓలు తెలిపారు. పరీక్షా సమయంలో విద్యార్థులు, ఇన్విజిలేటర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్ రెడ్డి, డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర్, రోజారాణి, కిశోర్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నెరవేరుతున్న బీసీల కల

- బీసీ కులాల ఆరామ క్షేత్రాల శ్లాబు నిర్మాణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బాలినేని
- మూడు దశాబ్దాలుగా ఆరామ క్షేత్రాల కోసం పడరాని పాట్లు
- గత ప్రభుత్వంలో బీసీ నేతలకు తప్పని ఇక్కట్లు
- సమస్యను పరిష్కరించడంలో బాలినేని చొరవపై బీసీ నేతల కృతజ్ఞతలు



ఆరామ క్షేత్రం శ్లాబు పనులను ప్రారంభిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: బీసీ కులాల ఆరామక్షేత్రాల శ్లాబు నిర్మాణ పనులను మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. బీసీ కులాల నాయకులు, కుల పెద్దల సమక్షంలో వేదమంత్రోచ్చరణల మధ్య నిర్మాణ పనులు ప్రారంభించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల గురించి నాయకులతో బాలినేని మాట్లాడారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు మాట్లాడుతూ బీసీ కులాలకు ఇది ఒక పెద్ద పండుగ రోజన్నారు. గత 30 ఏళ్లుగా అద్దె ఇళ్లల్లో నివాసం ఉండే బీసీలు పడే బాధలు వర్ణణాతీతమన్నారు. 2008లో అప్పటి వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో కౌన్సిల్‌లో తీర్మానం కూడా చేశారని, కానీ ఆయన మరణానంతరం ఆ ప్రక్రియ ముందుకు సాగలేదన్నారు. తరువాత చంద్రబాబు ప్రభుత్వం వచ్చినా ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. మళ్లీ వాసన్న మంత్రి కావడంతో మా సమస్యను పరిష్కరించడంతో పాటు అవసరమైన ఆర్థిక సాయం అందించి బీసీల గుండెల్లో మంచి స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. రజకాభివృద్ధి సంస్థ చైర్మన్ గుర్రం సుబ్బన్న మాట్లాడుతూ 2008లో మూడు ఎకరాల స్థలాన్ని రజకులకు కేటాయించారని, మిగిలిన స్థలంలో 5 సెంట్ల చొప్పున 8 కులాలకు కేటాయించారన్నారు. దీనిపై తాము టీడీపీ ప్రభుత్వంలో సహకరించమని కోరినా స్పందించలేదని, కానీ మళ్లీ వాసన్న అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయన మంచి మనస్సుతో సహకారం అందించి బీసీల కలలు నెరవేరుస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్ మాట్లాడుతూ రంగారాయుడు చెరువు పక్కన కోట్ల విలువైన స్థలాన్ని బీసీలకు ఆరామక్షేత్రాలుగా ఇవ్వడం కుదరదంటూ గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులు అడ్డుకున్నారన్నారు. 2008లో మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసినపుడు తాను కౌన్సిలర్‌గా కూడా ఉన్నానన్నారు. టీడీపీ హయాంలో సహకరించకపోగా రజకులను, స్థలాన్ని పొందిన మరో 8 బీసీ కులాల నేతలను అరెస్టు చేసి మానసికంగా వేధించారన్నారు. కానీ వాసన్న మాత్రం రజకులతోపాటు అందరు బీసీ కులాలతో మాట్లాడి అందరికీ స్థలాలను సర్దుబాటు చేయించి అన్ని కులాల వారికి ఆరామ క్షేత్రాలు వచ్చేలా అందరినీ ఒప్పించారన్నారు. ఆరామ క్షేత్రాల శ్లాబు నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయం అందించారని కొనియాడారు. సూర్యబలిజ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు సింగంశెట్టి శివరామకృష్ణ మాట్లాడుతూ సమస్యలను సృష్టించేవారు నేతలు కాదని, సమస్యలను పరిష్కరించే వారే నిజమైన నాయకులు అన్నారు. 55శాతం ఉన్న బీసీలు ఈ దఫా ఎన్నికల్లో బాలినేనిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. చాత్తాద శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు , నూర్‌భాషా సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు మీరామొహిద్దీన్ తదితరులు మాట్లాడుతూ బీసీలలో ఉన్న అన్ని కులాల వారిని సమైక్యపరిచి అందరినీ ఒకటిచేయడం ద్వారా బీసీ కులాల్లో ఐక్యత కల్పించిన బాలినేని శ్రీనివాసరెడ్డి విజయమే లక్ష్యంగా తాము పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుతారం శ్రీనివాసులు, సాహిత్య అకాడమీ డైరెక్టర్ బొప్పరాజు జ్యోతి, సూర్యబలిజ, కృష్ణబలిజ, భట్రాజు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ల డైరెక్టర్లు దాసరి కరుణాకర్, తిర్లిక శ్రీనివాసులు, సీహెచ్ శ్రీనివాసరాజు, ధరణికోట లక్ష్మీనారాయణ, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దులూరి శ్రీనివాసులు, శాలివాహన సంఘ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటరవణమ్మ, స్వాతి పైప్స్ అధినేత బాలకృష్ణ, మాజీ శాసనసభ్యులు కసుకుర్తి ఆదెన్న, జగనన్న ఫౌండేషన్ అధ్యక్షుడు వారా వీర్రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు గంటా రామానాయుడు, రాయని వెంకట్రావు, షేక్ జాని, నాగూర్, లీలా కుమారి, బెల్లం కొండ అశోక్, గుంజి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపట్నం బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జిపై పూర్తయిన రోడ్డు పనులు

మాటే..ఆయన అజెండా..

- బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి రోడ్డు పనులు పూర్తి
- సొంత నిధులు వెచ్చించి పనులు
- 20 వేల మందికి ఇళ్ల స్థలాలు
- దీర్ఘకాలిక తాగునీటి పథకానికి మోక్షం
- నగరాభివృద్ధిలో బాలినేని మార్క్

ఒంగోలు: జిల్లా ప్రజలు వాసన్నా అంటూ ప్రేమగా పిలుచుకునే బాలినేని శ్రీనివాసరెడ్డి..మాట ఇస్తే తప్పడంటే అన్న రీతిలో ముందుకు సాగుతున్నారు. ఒంగోలు నియోజకవర్గంలో ఏళ్ల తరబడి వెంటాడుతున్న దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపి తన మార్క్ చూయించారు. నగరంలో 25 వేల మందికి ఇళ్ల స్థలాల మంజూరుకు బాలినేని విశేష కృషి చేశారు.దశాబ్దాలుగా ఒంగోలు నగరాన్ని వెంటాడుతున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు దాదాపు రూ.300 కోట్ల తాగునీటి పథకానికి నిధులు మంజూరు చేయించారు.ఇక అసంపూర్తిగా ఉన్న బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జిపై రోడ్డు నిర్మాణానికి తన సొంత నిధులు వెచ్చించి పనులు పూర్తి చేయించారు.

సొంత నిధులు వెచ్చించి..

ఒంగోలు–కొత్తపట్నం రహదారిలో ప్రధాన సమస్య బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జిపై రోడ్డు. రూ.2015లో ఈ ప్రాజెక్టును రూ.7 కోట్ల అంచనాతో ప్రారంభించారు. కానీ తరువాతి ఏడాదే అప్పటి టీడీపీ ప్రభుత్వం అంచనాలను రెట్టింపు చేసి రూ.14 కోట్లకు పెంచింది. నిర్మాణ పనుల సమయంలోనే కేంద్ర కమిటీ బ్రిడ్జిని వెడల్పు చేయాలని సూచించడంతో అంచనాలు రూ.20.57 కోట్లకు చేరాయి. 2019 నాటికి బ్రిడ్జి పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ ఎన్నికల నాటికి ప్రభుత్వం రూ.8.40 కోట్లను మాత్రమే చెల్లించింది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్..మధ్యలోనే నిలిపివేశాడు. అనంతరం 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటికే బ్రిడ్జి నిర్మాణ సమయం పూర్తి కావడంతో కేంద్రం నిధులు ఆగిపోయాయి. ఇంకో వైపు అంచనాలు పెరిగిపోవడంతో పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. ఈ క్రమంలో ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగించేందుకు ప్రజల ఇబ్బందులను గమనించి బాలినేని కాంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడారు. ఎన్నికల లోగా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తానని ప్రజలకు బాలినేని ఇచ్చిన మాటకు కట్టుబడి సొంత నిధులు వెచ్చించి రోడ్డు పనులు పూర్తి చేయించారు.

పేదల ఇళ్ల పట్టాలకు ఎందాకైనా..

నగరంలో సుమారు 25 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలను బాలినేని పట్టుబట్టి సాధించారు. తొలుత యరజర్ల వద్ద 25 వేల మందికి పట్టాలు ఇవ్వాలని యత్నించగా టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారు. దీంతో ప్రజలకు ఇచ్చిన హామీని ఎలాగైనా నెరవేర్చాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించారు. ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తేనే పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. దాదాపు రూ.210 కోట్లు వెచ్చించి వందల ఎకరాల భూములను కొనుగోలు చేసి 21 వేల మందికి ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించి మరీ ముఖ్యమంత్రి చేతుల మీదుగా పంపిణీ చేయించారు. ఆ స్థలాల్లో పేదలు ఇళ్లుకట్టుకునేందుకు అవసరమైన రాయితీని సైతం అందించేందుకు రూ.1100 కోట్లు మంజూరు చేయించారు. ఈ లేఅవుట్‌కు తాగునీటి పైపులైన్లకోసం మరో రూ.230 కోట్లు కూడా అప్పటికప్పుడే వేదికపై సీఎం కేటాయించడం బాలినేని చిత్తశుద్ధికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

✔ నగరాన్ని దశాబ్దాలుగా వెంటాడుతున్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వానికి నివేదించి సుమారు రూ.340 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించగా..ఇటీవల ఒంగోలు వచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాగునీటి పథకం పనుల పైలాన్‌ను ఆవిష్కరించారు. ప్రస్తుతం టెండర్ దశ పూర్తి చేసుకున్న ఈ పథకం పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఒంగోలు రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై శ్లాబుల మధ్య వేసిన రబ్బర్లు, ఇనుము దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్నాయి. ఆ పనులను సైతం బాలినేని పూర్తి చేయించారు.

గ్రామ స్థాయిలో సుపరిపాలన

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



మర్రిపూడిలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సురేష్

మర్రిపూడి: గ్రామ స్థాయిలో సుపరిపాలన అందిస్తూ, పేద ప్రజలకు సంక్షేమ లబ్ధిని చేకూర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండల కేంద్రం మర్రిపూడి, జువ్విగుంట, తంగెళ్ల, మర్రిపూడి గ్రామాల్లో రూ.3 కోట్లతో నిర్మించిన సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్లను మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. చంద్రబాబు జన్మభూమి కమిటీలు తెచ్చి టీడీపీ వారికే పథకాలు ఇచ్చుకున్నాడని దుయ్యబట్టారు. సీఎం వైఎస్ జగన్ మాత్రం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధిని గడప వద్దకే చేర్చారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కొండపి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఒక్కసారి అవకాశం ఇస్తే కొండపి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా ఆయా గ్రామాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు దొడ్డాలి మల్లికార్జున, జెడ్పీటీసీ మాకినేని సుధారాణి వెంకట్రావు, నాయకులు ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, మాచేపల్లి నాగయ్య, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, మొల్లల శివరామిరెడ్డి, ఎస్‌కే నాసర్‌వలి, రావులపల్లి పెదనర్సింహా, కంజుల బ్రహ్మరెడ్డి, కదిరి భాస్కర్, ఇనుకొల్లు శ్రీనివాసరెడ్డి, డి.కృష్ణారెడ్డి, ఎస్‌కే మస్తాన్, దేవరపల్లి శ్రీనివాసరెడ్డి, కె.రమణారెడ్డి, వనిపెంట మల్లికార్జునరెడ్డి, ఏవీ రెడ్డి, పి.రామిరెడ్డి, కోండ్రు ఇజ్రాయిల్, గురిజాల యేబు, బి.నరసింహారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్‌కు ప్రభుత్వ గుర్తింపు

ఒంగోలు: ఏపీ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్‌కు ప్రభుత్వ గుర్తింపు ఇస్తూ గురువారం ఉత్తర్వులు జారీకావడంపై ఏపీ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్టిగుంట మహేశ్వరరావు, పర్వతం రమణారెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి, విద్యాశాఖామంత్రి బొత్స సత్యన్నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. వీరితో పాటు సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం సుధీర్, ఇతర సభ్యులు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ గుర్తింపు వల్ల ప్రభుత్వంలో ఏదైనా విషయంపై చర్చించేటప్పుడు తమ సంఘానికి ఆహ్వానం ఉంటుందని, రాష్ట్రంలో ఉన్న ఇతర గుర్తింపు సంఘాలకు ఎటువంటి సదుపాయాలున్నాయో అవన్నీ తమ సంఘ రాష్ట్ర, జిల్లా, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు కూడా ఇకనుంచి లభిస్తాయని తెలిపారు. దీనివల్ల ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో ఏపీ వైఎస్సార్ టీఏ ముందుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వైఎస్సార్ సీపీలోకి 100 కుటుంబాలు

- సమతానగర్‌లో బాలినేని సమక్షంలో జనసేన నుంచి చేరిక
- కర్నూల్ రోడ్డు జంక్షన్ నుంచి సమతానగర్ వరకు బైక్ ర్యాలీ


సమతానగర్‌లో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: నగరంలోని సమతానగర్‌లో జనసేన నుంచి 100 కుటుంబాలకు పైగా జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. తొలుత గురువారం రాత్రి స్థానిక కర్నూల్‌రోడ్డు జంక్షన్ నుంచి సమతానగర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్, సాయి, శ్రీను వారి మిత్రబృందానికి బాలినేని శ్రీనివాసరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మనమంతా ఒక కుటుంబమని, ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. తాను ఐదుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసినా ఏ ఒక్కరికీ ద్రోహం చేయలేదన్నారు. నా మంచితనాన్ని తెలుసుకునే పవన్‌కళ్యాణ్ సైతం రెండుసార్లు పబ్లిక్ మీటింగ్‌లో ప్రశంసించారన్నారు. 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇస్తే ఓట్లన్నీ ఎక్కడ బాలినేనికి పడతాయోననే పేదలకు పట్టాలు పంపిణీ చేయకుండా ప్రతిక్షణం టీడీపీ నాయకులు అడ్డుపడ్డారన్నారు. రూ.230 కోట్లు వెచ్చించి 21 వేల మందికి పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి మరీ పంపిణీ చేస్తే దొంగ పట్టాలంటూ జనార్దన్ విమర్శలు చేయడంపై మండిపడ్డారు. దొంగ పట్టాలని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించానని, నిరూపించకుంటే జనార్దన్ పోటీ నుంచి తప్పుకోవడంతో పాటు ఆయన ఆస్తిని ప్రజలకు రాసివ్వాలన్నారు. అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చామని, పార్టీలు చూడలేదని చెప్పారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రాగానే తాను కాబోయే మంత్రి వాసన్న అంటూ సీఎం జగన్ పరిచయం చేశారన్నారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన 9 నెలల్లోనే పేదలకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు కట్టించి ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణాలు చేసుకునేలా చర్యలు చేపడతానన్నారు. పార్టీలో చేరిన వారు, గతంలో పార్టీలో ఉన్న వారు అందరు సమన్వయంగా వ్యవహరిస్తూ సమతానగర్‌లో మంచి మెజార్టీ అందించాలని కోరారు. వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ సమతానగర్‌లో చేరిన శ్రీకాంత్, సాయి, శ్రీను వారి మిత్ర బృందం రాకతో ఇక్కడ మంచి మెజారిటీ వస్తుందన్నారు. సమతానగర్ వాసులు పలువురు మాట్లాడుతూ డివిజన్‌లో సీసీ రోడ్లతో పాటు మంగమూరు డొంకకు నేరుగా కనెక్షన్ ఉండేలా తారురోడ్డు నిర్మాణం చేయడం తమకు ఆనందంగా ఉందన్నారు. నగర అధ్యక్షుడు కటారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి కోటేశ్వరరావు, 38వ డివిజన్ ఇన్‌చార్జి వర్ధ శేషయ్య, 37వ డివిజన్ అధ్యక్షుడు జి.వెంకారెడ్డి, 45వ డివిజన్ నాయకులు సీఎం వెంకటేశ్వరరెడ్డి, గంటా రామానాయుడు, స్థానిక నాయకులు రాయని వెంకట్రావు, రాయని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శ్రీరాం

సింగరాయకొండ (మర్రిపూడి): వరకట్న వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి సింగరాయకొండ మండల కేంద్రంలోని బుంగబావి సెంటర్ సమీపంలో స్టాలిన్‌నగర్ రెండో లైన్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. స్టాలిన్‌నగర్ రెండోలైన్‌లో నివసిస్తున్న షేక్ రేష్మాకు రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి 10 నెలల బాబు ఉన్నాడు. పెళ్లి సమయంలో రెండు లక్షల నగదు, రూ.30 వేల విలువైన వస్తువులు కట్నంగా ఇచ్చారు. కొంతకాలంగా భర్త ఉస్మాన్‌బాషా అదనపు కట్నం తేవాలని భార్య రేష్మాను మానసికంగా హింసించడంతో ఆమె తన ఇంటిలోని బెడ్‌రూంలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు సింగరాయకొండ, కందుకూరు ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స చేయించేందుకు ప్రయత్నం చేసినా విఫలమై ఆమె మరణించింది. ఎస్‌ఐ శ్రీరాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సొంతింటి కల నెరవేర్చిన సీఎం జగన్

- రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మేరుగు


లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, నాయకులు

నాగులుప్పలపాడు: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా పేదవాడి సొంతింటి కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త మేరుగు నాగార్జున అన్నారు. ఇళ్ల స్థలాలు వచ్చిన వారికి ప్రభుత్వమే ఉచితంగా లబ్ధిదారుడి పేరుతో రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని గురువారం ఉప్పుగుండూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ అట్టడుగునున్న వారిని కూడా వృద్ధిలోకి తేవాలని, వారిని సమాజంలో గౌరవ మర్యాదలతో బతికేలా చేయాలని తాపత్రయపడుతున్న జగనన్న ఆశయానికి అనుగుణంగానే లబ్ధిపొందిన అక్కచెల్లెమ్మలు ముఖ్యమంత్రి పాలన పట్ల సంతోషంగా ఉన్నారన్నారు. తమ జీవిత కాలంలో పొందలేము అనుకున్న వాటిని సొంతం చేసుకునేలా చేసిన జగనన్న పరిపాలనకు కృతజ్ఞతగా ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలను అరాచక శక్తులు ట్రోల్ చేసి హింసించడం చాలా బాధాకరమన్నారు. ఇలాంటి అరాచకశక్తులకు బలైపోయిన గీతాంజలి లాంటి ఆడబిడ్డ.. సొంతిల్లు అనేది తన జీవితకాల స్వప్నమని చెప్పినందుకే అన్యాయంగా ఆమెను పొట్టనపెట్టుకున్నారన్నారు. మహిళలను చిన్న చూపు చూసే పార్టీలు, వ్యక్తులకు త్వరలో ప్రజలు సరైన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. శ్రీరాముడి లాంటి పాలన అందిస్తున్న జగనన్నకు మనమంతా అండగా ఉండాలని మంత్రి కోరారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, ఇనగంటి రమణారెడ్డి, గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ, ఎంపీటీసీలు తాటి అనూరాధ, మున్నంగి వెంకట్రావు, కొలకలూరి విజయ్‌కుమార్, నాయకులు మాదాసు రాంబాబు, మద్దిసాని నాగేశ్వరరావు, ఉప్పుగుండూరి శ్రీనివాస ప్రసాద్, పెంట్యాల శ్రీనివాసరావు, బాలకృష్ణ, పోలినేని కోటేశ్వరరావు, పాలపర్తి ప్రవీణ్, వజ్రం బాబు, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


దర్శిలో బూచేపల్లి ఆధ్వర్యంలో భారీ ర్యాలీలో పాల్గొన్న మహిళలు

గీతాంజలిని పొట్టనబెట్టుకున్నారు

- టీడీపీ, జనసేన తీరుపై దర్శి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ధ్వజం
- నిందితులను కఠినంగా శిక్షించాలన్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ
- దర్శిలో నిరసన ప్రదర్శనకు పార్టీలకతీతంగా వేలాదిగా హాజరైన మహిళలు

దర్శి/జరుగుమల్లి: తెనాలిలో ఇంటి పట్టా అందుకుని సంతోషాన్ని వెలిబుచ్చిన గీతాంజలిని టీడీపీ–జనసేన కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా దారుణంగా ట్రోల్ చేసి ఆత్మహత్యకు పురిగొల్పారని వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మండిపడ్డారు. గీతాంజలి మృతికి కారకులైన వారిని శిక్షించాలని కోరుతూ గురువారం దర్శి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి, గడియార స్తంభం సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ర్యాలీలో పార్టీలకతీతంగా దాదాపు 5 వేల మంది మహిళలు పాల్గొని గీతాంజలి కుటుంబానికి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుధా అచ్చయ్య, పట్టణ అధ్యక్షులు కట్టికోట హరీష్, వైస్ ఎంపీపీలు కొరివి ముసలయ్య, సోము దుర్గారెడ్డి, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, మాజీ సాగర్ ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ సద్ది పుల్లారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కోరే సుబ్బారావు, మాజీ సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు చింతలపూడి శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు మేడం మోహన్‌రెడ్డి, జగన్నాథం మోహన్‌బాబు, తుళ్లూరి బాబురావు తదితరులు పాల్గొన్నారు.


జరుగుమల్లి : సంతాపం తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జరుగుమల్లి మండలం వావిలేటిపాడు అడ్డరోడ్డు వద్ద వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బత్తిన మనోహర్ ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. గీతాంజలి మృతికి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు దుంపా అనిల్‌కుమార్ రెడ్డి, సర్పంచి కసుకుర్తి పున్నారావు, వావిలేటి పాడు సర్పంచి పాలేటి వెంకటరత్నం పాల్గొన్నారు.

పథకాలు కొనసాగాలంటే జగనే సీఎం కావాలి

- వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దద్దాల నారాయణయాదవ్
- రూ.3.57 కోట్ల చేయూత చెక్కుల పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న దద్దాల, ఎంపీపీ, పీడీసీసీబీ చైర్మన్

సీఎస్ పురం (పామూరు): రాష్ట్ర ప్రజల సంక్షేమ ప్రదాత.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. పేదల కష్టాలు తీర్చే సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎంగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాల్సిందేనని స్పష్టం చేశారు. స్థానిక ఆర్‌ఎంఎస్ కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన వైఎస్సార్ చేయూత నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీసీసీబీ చైర్మన్ వైఎం.ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీతో కలిసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లబ్ధిదారులైన 1902 మంది మహిళలకు రూ.3.57 కోట్ల విలువైన చేయూత చెక్కులను దద్దాల పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని డాక్టర్ దద్దాల కోరారు. ముందుగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం విద్యాసాగర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బి.వెంకటయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బుజ్జి, నారాయణస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు బొర్రాజు రమణయ్య, ఎం.అటేలయ్య, బత్తుల దేవరాజ్, అంబాల శేఖర్‌రెడ్డి, ఎస్.ప్రకాష్‌రెడ్డి, డాక్టర్ షేక్ గౌస్, మితికాల గురవయ్య, దీర్లదిన్నె లక్ష్మీనారాయణ, దనెంకుల నాగేంద్ర, మోరం మొరార్జి, మర్రి రామయ్య, బొట్లా చిరంజీవి, ముప్పాళ్ల అనంతరాజు, వేల్పుల నారాయణయాదవ్, వాసు, ఖాజా, వాడా లక్ష్మీరెడ్డి, పులి చంద్రశేఖర్, ఎంపీటీసీలు, సీసీ ఎం.నారాయణమ్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్ సీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్
- యర్రగొండపాలెంలో రూ.23.25 కోట్లతో నిర్మించిన 100 పడకల వైద్యశాల ప్రారంభం


వైపాలెంలో 100 పడకల వైద్యశాలను ప్రారంభిస్తున్న తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 17 మెడికల్ కళాశాలలు తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని, పేదలకు మెరుగైన సేవలు అందించేందుకు రికార్డు స్థాయిలో 53 వేల వైద్య ఉద్యోగాలను భర్తీ చేశారని వైఎస్సార్ సీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. యర్రగొండపాలెంలో రూ.23.25 కోట్లతో నూతనంగా నిర్మించిన 100 పడకల వైద్యశాలను తాటిపర్తి గురువారం ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. వైద్యశాల పూర్తి కావడానికి ఎనలేని కృషి చేసిన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు కృతజ్ఞతలు తెలియజేయాలన్నారు. పెద్దదోర్నాల మండలం ఐనముక్కలలో రూ.50 కోట్లతో గిరిజన సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ప్రారంభానికి సిద్ధంగా ఉందని, పెద్దదోర్నాలలో వైద్యశాలను రూ.3 కోట్లతో ఆధునీకరించి 50 పడకల వైద్యశాలగా అప్‌గ్రేడ్ చేసినట్లు పేర్కొన్నారు. అధికారం కోసం అర్రులు చాస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బూటకపు హామీలతో మభ్యపెడుతూ మరోసారి ప్రజల ముందుకు వస్తోందని, వారికి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 100 పడకల వైద్యశాలను జిల్లా వైద్యశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానన్నారు. వారం రోజుల్లోగా వైద్యశాలకు రెండు మార్చురీ బాక్సులు సమకూరుస్తానని, వైద్యశాలలో పనిచేస్తున్న వారికి ఇంటి స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, వైద్య శాఖ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మూర్తి, స్థానిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, వైద్యాధికారులు రాంజీనాయక్, అనిల్, సూర్యప్రకాష్, కృష్ణారెడ్డి, చైతన్య సుధ, సూర్యప్రకాష్, ముబీన, ఈఈ విజయభాస్కర్, డీఈ అనీల్‌కుమార్, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ జబీవుల్లా, సర్పంచ్ ఆర్.అరుణాబాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి


మృతిచెందిన డ్రైవర్ మలంషావలి (ఫైల్)

బేస్తవారిపేట: గిద్దలూరు నుంచి చెన్నై వెళ్లే ఆర్టీసీ బస్సుకు డ్రైవర్‌గా వెళ్లిన బేస్తవారిపేటకు చెందిన దూదేకుల మలంషావలి కారు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన గూడూరు–నాయుడుపేట మధ్య గురువారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. గిద్దలూరు నుంచి చెన్నై వెళ్తుండగా ఉదయం 4.30 నిమిషాల సమయంలో బస్సు టైరు పంక్చర్ కావడంతో బస్సు దిగి టైరు మారుస్తున్న సమయంలో వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మలంషావలి మృతి చెందినట్లు తెలిసింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సెంట్రల్: ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా 2023–24 సంవత్సరానికి సంబంధించి ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలు మంజూరు చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారి ఎన్.లక్ష్మానాయక్ కోరారు. అందుకోసం ముందుగా సచివాలయంలో నవశకం లాగిన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ పథకంలో మాన్యువల్ స్కావెంజర్స్, టీనర్స్, ఫ్లేయర్స్ (చర్మం తీయువారు మరియు తోళ్లు శుద్ధి చేయువారు), వేస్ట్ పిక్కర్స్ (వ్యర్థ పదార్థాలు సేకరించేవారు), హాజార్డస్ క్లీనింగ్ (భూగర్భ పైపులైన్లు శుభ్రం) చేసే వారి పిల్లలు 1 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుకున్న వారు అర్హులని తెలిపారు. సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, వార్డ్ ఎడ్యుకేషన్ లేదా ప్రాసెసింగ్ సెక్రటరీ ద్వారా నవశకం లాగిన్‌లో ఏప్రిల్ 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నమోదైన దరఖాస్తులను ఎంపీడీఓ లేదా మున్సిపల్ కమిషనర్లు ఏప్రిల్ 20వ తేదీలోపు ఆమోదించాలని చెప్పారు.

అభివృద్ధి ప్రదాత వైఎస్ జగన్

- ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఏపీఐఐసీ చైర్మన్ జంకె
- మార్కాపురంలో చేయూత లబ్ధిదారులకు చెక్కు పంపిణీ


లబ్ధిదారులకు చేయూత చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాంబాబు, జంకె

మార్కాపురం టౌన్: రాష్ట్ర ప్రజల ఆర్థికాభివృద్ధికి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, ఏపీఐఐసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి కోరారు. గురువారం స్థానిక డ్వాక్రా బజారులో మార్కాపురం పట్టణ, మండల, తర్లుపాడు మండలాల వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు నాలుగో విడత నిధుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గడిచిన 58 నెలల పాలనలో సీఎం వైఎస్ జగన్ 127 సార్లు బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారని పేర్కొన్నారు. మార్కాపురం పట్టణ, మండల, తర్లుపాడు మండలాల్లో వైఎస్సార్ చేయూత 4 విడతల్లో 7,523 మంది మహిళలకు రూ.51.11 కోట్లు అందించినట్లు వెల్లడించారు.

చంద్రబాబు ఓ దగాకోరు

రాష్ట్రంలో 14 ఏళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు ఎన్నికల హామీలను గాలికొదిలేసి ప్రజా ధనాన్ని దోచుకోవడానికే ప్రాధాన్యమిచ్చారని దుయ్యబట్టారు. వెలిగొండ ప్రాజెక్టుకు 2004 ఎన్నికల ముందు హడావుడిగా శంకుస్థాపన చేసి పైసా విదల్చలేదని గుర్తు చేశారు. వైఎస్సార్ ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు పనులను ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ పూర్తి చేసి పశ్చిమ ప్రకాశం వాసుల స్వప్నాన్ని సాకారం చేశారని కొనియాడారు. టీడీపీ నేతల బూటకపు హామీలను నమ్మితే మోసపోవడం ఖాయమని హెచ్చరించారు. మంచి చేస్తున్న వైఎస్ జగన్‌ను దీవించాలని, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని అన్నా రాంబాబు కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, జెడ్పీటీసీలు నారు బాపన్‌రెడ్డి, వెన్నా ఇందిర, ఎంపీపీలు బండి లక్ష్మీదేవి, సూరెడ్డి భూలక్ష్మి, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నాలి కొండయ్య, ఏఎంసీ డైరెక్టర్ డాక్టర్ మగ్బుల్‌బాగా, మాజీ ఎంపీటీసీ బట్టగిరి తిరుపతిరెడ్డి, సీహెచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా వైఎస్సార్ సీపీ

- ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కేపీ


ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డికి స్వాగతం పలుకుతున్న ముస్లిం మత పెద్దలు

గిద్దలూరు రూరల్(రాచర్ల): ముస్లిం మైనారిటీల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గిద్దలూరు పట్టణంలోని షాదీఖానాలో గురువారం ఏర్పాటు చేసిన ముస్లింలు మైనారిటీల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ అమలు చేసిన ఘనత వైఎస్సార్‌దేనని కొనియాడారు. సీఎం వైఎస్ జగన్ మైనారిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతోపాటు వైఎస్సార్ షాదీ తోఫా, మసీదుల్లో మౌల్వీలకు గౌరవ వేతనం అందించి అండగా నిలిచారన్నారు. నిరుపేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. గిద్దలూరు నియోజకవర్గంలోని ముస్లింలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి, జగనన్న ముఖ్యమంత్రి అయ్యేలా దీవించాలని కోరారు. తొలుత ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డికి పట్టణంలోని ముస్లింలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మార్కాపురం ఏఎంసీ చైర్మన్ మీర్జా షంషీర్ అలీబేగ్, మండల కోఆప్షన్ సభ్యుడు మస్తాన్‌వలి, కౌన్సిలర్లు షేక్షావలి, పెద్దవలి, నాయకులు రషీద్, మదార్‌పల్లి బాషా, షేక్.ఖాజా, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.